PRGI Reg No. TGTEL/25/A0555
https://www.youtube.com/@PrabhathaSuryuduNews
https://www.facebook.com/prabhathasuryudu

# ప్రభాత సూర్యుడు

నిజం దాగదు.. వార్త ఆగదు
జాతీయ తెలుగు దినపత్రిక
www.prabhathasuryudu.com

తెలంగాణ | సంపుటి : 01 | సంచిక 241 | పేజీలు : 8 | వెల రూ.5 | శుక్రవారం 25.09.2026

ఎడిటర్ : చెరుకు ఉపేందర్
Published From Rangareddy
Circulated to All Districts of Telangana and Andhra Pradesh




WANTED REPORTERS

# ట్రాఫిక్ సమస్యలకు శాశ్వత పరిష్కారం

## తెలంగాణ ట్రాఫిక్ మేనేజ్‌మెంట్, రోడ్ అండ్ రైల్ సేఫ్టీ బ్యూరో ఏర్పాటు

## రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక వ్యవస్థ..


## 'గోల్డెన్ అవర్'లో క్షతగాత్రులకు వైద్యం



హైదరాబాద్ – ప్రభాత సూర్యుడు: రాష్ట్రంలో నిత్యం ఎదురవుతున్న ట్రాఫిక్ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపడంతో పాటు రోడ్డు ప్రమాదాలను అరికట్టేందుకు ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ట్రాఫిక్ నిర్వహణను కేవలం చలానాలు విధించడం, జరిమానాలు వసూలు చేయడానికే పరిమితం చేయకుండా శాస్త్రీయ పద్ధతుల్లో ట్రాఫిక్ నియంత్రణ, రోడ్డు భద్రత, అత్యవసర వైద్య సాయం అందించడంపై దృష్టి సారిస్తూ 'తెలంగాణ ట్రాఫిక్ మేనేజ్‌మెంట్, రోడ్ అండ్ రైల్ సేఫ్టీ బ్యూరో' (టీజీ–టీఎంఏఆర్ఎస్)ను ఏర్పాటు చేసింది. ఈ మేరకు ప్రభుత్వం జీవో నంబర్ 135ను జారీ చేసింది. 'రాష్ట్ర రోడ్డు భద్రతా మండలి' పరిధిలో పనిచేసే ఈ ప్రత్యేక విభాగం ముఖ్యమంత్రి పరిధిలో కొనసాగనుంది. హైదరాబాద్ కేంద్రంగా అదనపు డీజీపీ లేదా ఐజీపీ స్థాయి అధికారి నేతృత్వంలో బ్యూరో కార్యకలాపాలు నిర్వహించనుంది. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న రహదారులు, వాహనాల రాకపోకలను సమగ్రంగా పర్యవేక్షించడంతో పాటు రోడ్డు రవాణా, మెట్రో, రైల్వే భద్రతకు సంబంధించిన అంశాలపై కూడా ఈ విభాగం ప్రత్యేక దృష్టి సారించనుంది. రాష్ట్రంలో 32 వేల కిలోమీటర్లకు పైగా ఉన్న రహదారులు, 1.8 కోట్లకు పైగా వాహనాల రాకపోకలను పర్యవేక్షించేలా ఈ వ్యవస్థను రూపొందించారు. ప్రమాదాల సంఖ్యను తగ్గించడం, ట్రాఫిక్‌ను మెరుగ్గా నియంత్రించడం, ప్రమాదాలు జరిగినప్పుడు వేగంగా స్పందించడం వంటి అంశాలకు ప్రాధాన్యం ఇవ్వనున్నారు. రోడ్డు ప్రమాదాల్లో క్షతగాత్రుల ప్రాణాలను కాపాడేందుకు ప్రతి పోలీస్‌స్టేషన్‌లో 24 గంటలూ అందుబాటులో ఉండేలా 'రోడ్ యాక్సిడెంట్ రెస్పాన్స్ ఆఫీసర్'ను నియమించనున్నారు. ప్రమాదం జరిగిన వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రులను గుర్తించి 'గోల్డెన్ అవర్'లో ఆసుపత్రికి తరలించడం వీరి ప్రధాన బాధ్యతగా ఉంటుంది. దీంతో ప్రమాద బాధితులకు సకాలంలో వైద్యసాయం అందేలా చర్యలు చేపట్టనున్నారు. ఔటర్ రింగ్ రోడ్డు (ఓఆర్ఆర్), 50 కిలోమీటర్లకు మించి పొడవున్న హైవేలపై ప్రత్యేక 'హైవే పెట్రోలింగ్ యూనిట్లను' ఏర్పాటు చేయనున్నారు. స్పీడ్ డిటెక్టర్లు, అత్యాధునిక కెమెరాలతో కూడిన ఈ యూనిట్లు నిరంతరం హైవేలపై పహారా నిర్వహిస్తూ అతివేగం, ప్రమాదకర డ్రైవింగ్ వంటి వాటిపై నిఘా ఉంచనున్నాయి. ఈ ప్రత్యేక వ్యవస్థ నిర్వహణ కోసం ప్రభుత్వం 'ట్రాఫిక్ మేనేజ్‌మెంట్ ఫండ్'ను ఏర్పాటు చేసింది. పోలీసులకు వచ్చే ట్రాఫిక్ జరిమానాల్లో 40 శాతం మొత్తాన్ని నేరుగా ఈ నిధికి మళ్లించనున్నారు. ఈ నిధులను ట్రాఫిక్ సిబ్బంది శిక్షణ, అధునాతన సాంకేతిక పరిజ్ఞానం వినియోగం, పెట్రోలింగ్ వాహనాల సమకూర్పు, రహదారుల అత్యవసర మరమ్మతులు తదితర అవసరాలకు వినియోగించనున్నారు. ట్రాఫిక్ నియంత్రణతో పాటు రోడ్డు ప్రమాదాల నివారణ, ప్రమాదం జరిగిన వెంటనే స్పందించే వ్యవస్థను బలోపేతం చేయడం ద్వారా రాష్ట్రంలో రోడ్డు భద్రతను మరింత మెరుగుపర్చేందుకు ఈ కొత్త బ్యూరో కీలకంగా పనిచేయనుంది.

# షర్మిల కుమార్తె నిశ్చితార్థ వేడుక

## కాబోయే వధూవరులను ఆశీర్వదించిన సీఎం దంపతులు



హైదరాబాద్ – ప్రభాత సూర్యుడు: ఏపీ పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల కుమార్తె అంజిలి, రఘు నిశ్చితార్థ వేడుక ఘనంగా జరిగింది. కొత్వాల్‌గూడలో నిర్వహించిన ఈ వేడుకకు తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి దంపతులు హాజరై కాబోయే వధూవరులను ఆశీర్వదించారు. నూతన జీవితంలోకి అడుగుపెడుతున్న అంజిలి, రఘుకు శుభాకాంక్షలు తెలియజేసి, వారి భవిష్యత్తు ఆనందంగా ఉండాలని ఆకాంక్షించారు. ఈ నిశ్చితార్థ వేడుకకు తెలంగాణ శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి కూడా హాజరయ్యారు. వారు కాబోయే వధూవరులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపారు. కుటుంబ సభ్యులు, బంధువులు, సన్నిహితుల సమక్షంలో వేడుక సందడిగా సాగింది.


# లాభాల్లో ముగిసిన స్టాక్ మార్కెట్లు

## స్వల్పంగా తగ్గిన బంగారం ధరలు



హైదరాబాద్ – ప్రభాత సూర్యుడు: దేశీయ స్టాక్ మార్కెట్లు సోమవారం లాభాలతో ముగిశాయి. సెన్సెక్స్ 564 పాయింట్లు లాభపడి 74,858 వద్ద ముగిసింది. నిఫ్టీ 67 పాయింట్లు లాభంతో 23,414 వద్ద స్థిరపడింది. మరోవైపు హైదరాబాద్ బులియన్ మార్కెట్‌లో బంగారం ధరలు స్వల్పంగా తగ్గాయి. 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.150 తగ్గి రూ.1,42,700కు చేరింది. 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.160 తగ్గి రూ.1,55,680గా నమోదైంది. కిలో వెండి ధరలో ఎలాంటి మార్పు లేకుండా రూ.2,60,000 వద్ద కొనసాగుతోంది. రెండు తెలుగు రాష్ట్రాల్లోనూ దాదాపు ఇదే ధరలు కొనసాగుతున్నాయి.

# ఆసియా క్రీడల్లో భారత్‌కు ఆరో పతకం



హైదరాబాద్ – ప్రభాత సూర్యుడు: ఆసియా క్రీడల్లో భారత్ పతకాల వేట కొనసాగుతోంది. సోమవారం భారత్ ఖాతాలో మరో పతకం చేరడంతో మొత్తం పతకాల సంఖ్య ఆరుకు చేరింది. ఇప్పటివరకు భారత్ నాలుగు రజతాలు, రెండు కాంస్య పతకాలు సాధించింది. షూటింగ్‌లోనే ఐదు పతకాలు రాగా, మిక్స్‌డ్ మార్షల్ ఆర్ట్స్‌లో ఒక కాంస్య పతకం లభించింది.

# కావేరి జలాల వివాదంపై సుప్రీంకోర్టు కీలక తీర్పు

## కర్ణాటకకు అదనంగా 70 టీఎంసీల నీరు కేటాయించాలన్న పిటిషన్ కొట్టివేత



దిల్లీ – ప్రభాత సూర్యుడు: కావేరి జలాల వివాదంపై సుప్రీంకోర్టు కీలక తీర్పు వెలువరించింది. కర్ణాటకకు అదనంగా 70 టీఎంసీల కావేరి జలాలను కేటాయించాలని కోరుతూ దాఖలైన రిట్ పిటిషన్‌ను సుప్రీంకోర్టు కొట్టివేసింది. అంతర్రాష్ట్ర నదీ జలాల కేటాయింపుల విషయంలో సంబంధిత రాష్ట్ర ప్రభుత్వాలకే న్యాయపరంగా మాట్లాడే హక్కు ఉంటుందని స్పష్టం చేసింది. అంతర్రాష్ట్ర జల వివాదాల్లో థర్డ్ పార్టీలు లేదా ప్రైవేట్ సొసైటీలు దాఖలు చేసే పిటిషన్లను పరిగణనలోకి తీసుకోలేమని సుప్రీంకోర్టు పేర్కొంది. నదీ జలాల పంపిణీకి సంబంధించిన అంశాల్లో రాష్ట్రాల హక్కులు, అధికార పరిధికి ప్రాధాన్యం ఉంటుందని స్పష్టం చేసింది. ఈ నేపథ్యంలో కర్ణాటకకు అదనంగా 70 టీఎంసీల నీటిని కేటాయించాలన్న డిమాండ్‌తో దాఖలైన పిటిషన్‌ను తిరస్కరించింది. కావేరి నదీ జలాల పంపిణీ కర్ణాటక, తమిళనాడు మధ్య చాలాకాలంగా వివాదాస్పద అంశంగా కొనసాగుతున్న నేపథ్యంలో సుప్రీంకోర్టు తాజా తీర్పు ప్రాధాన్యం సంతరించుకుంది.

# రేపు సిద్దిపేట జిల్లాలో కాంగ్రెస్ ఎంపీల పర్యటన




సిద్దిపేట – ప్రభాత సూర్యుడు: సిద్దిపేట జిల్లాలో శుక్రవారం కాంగ్రెస్ ఎంపీల బృందం పర్యటించనుంది. అసెంబ్లీ నుంచి ప్రత్యేక బస్సులో బయలుదేరి సిద్దిపేట జిల్లాకు చేరుకోనున్న ఎంపీలు.. జిల్లాలో కబ్జాకు గురైనట్లు ఆరోపణలు ఉన్న ప్రభుత్వ భూములను పరిశీలించనున్నారు. అనంతరం సిద్దిపేట జిల్లా రెవెన్యూ అధికారులతో ఎంపీల బృందం సమావేశం కానుంది. ప్రభుత్వ భూముల వివరాలు, వాటి పరిస్థితి, ఆక్రమణలకు సంబంధించిన అంశాలపై అధికారులతో చర్చించనున్నట్లు సమాచారం. ఇటీవల సీఎం రేవంత్‌రెడ్డి కేసీఆర్ ఫాంహౌస్‌కు సంబంధించిన భూములపై విచారణకు ఆదేశించిన నేపథ్యంలో కాంగ్రెస్ ఎంపీల సిద్దిపేట పర్యటనకు ప్రాధాన్యత ఏర్పడింది. ఈ పర్యటనలో ఎంపీలు ఏయే అంశాలను పరిశీలిస్తారు, అధికారులతో సమావేశంలో ఎలాంటి వివరాలు తెలుసుకుంటారన్నది ఆసక్తికరంగా మారింది.




షేక్.. షేక్.. అభిషేక్..!!
30 బంతుల్లో సెంచరీ
ఆఫ్ఘన్ బౌలర్లను ఊచకోత

# ట్యాంక్‌బండ్‌పై కేసీఆర్ పాటలతో యువత సందడి

## గణేష్ నిమజ్జన వేడుకల్లో డీజేల ఆంక్షల నేపథ్యంలో ఆసక్తికర దృశ్యం



హైదరాబాద్ – ప్రభాత సూర్యుడు: హైదరాబాద్‌లో గణేష్ నిమజ్జన వేడుకల సందర్భంగా ట్యాంక్‌బండ్‌పై ఆసక్తికర దృశ్యం కనిపించింది. నిమజ్జన వేడుకల్లో డీజేల వినియోగంపై ప్రభుత్వం విధించిన ఆంక్షల నేపథ్యంలో కొందరు యువత కేసీఆర్‌కు సంబంధించిన పాటలను వినిపిస్తూ సందడి చేశారు. ట్యాంక్‌బండ్ పరిసరాల్లో గణేష్ విగ్రహాల నిమజ్జనానికి తరలివచ్చిన యువత పాటలకు అనుగుణంగా ఉత్సాహంగా సందడి చేశారు. కేసీఆర్‌కు సంబంధించిన పాటలు వినిపించడంతో అక్కడి వాతావరణం కొంతసేపు రాజకీయ రంగును సంతరించుకుంది. నిమజ్జన వేడుకలు ప్రశాంతంగా జరిగేలా పోలీసులు పలు ఆంక్షలు అమలు చేస్తుండగా.. డీజేల విషయంలోనూ నిబంధనలు పాటించాలని నిర్వాహకులకు సూచిస్తున్నారు. ఈ నేపథ్యంలో ట్యాంక్‌బండ్‌పై కేసీఆర్ పాటలతో యువత సందడి చేయడం చర్చనీయాంశంగా మారింది.



# సుప్రీంకోర్టులో దానం నాగేందర్‌కు భారీ షాక్

## హైకోర్టు అనర్హత తీర్పును సమర్థించిన సుప్రీంకోర్టు

## ఖైరతాబాద్‌లో ఉప ఎన్నికకు మార్గం సుగమం

దిల్లీ/హైదరాబాద్ – ప్రభాత సూర్యుడు: ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్‌కు సుప్రీంకోర్టులో భారీ ఎదురుదెబ్బ తగిలింది. ఎమ్మెల్యే పదవికి దానం నాగేందర్‌ను అనర్హుడిగా ప్రకటిస్తూ తెలంగాణ హైకోర్టు ఇచ్చిన తీర్పును సుప్రీంకోర్టు సమర్థించింది. హైకోర్టు తీర్పును సవాల్ చేస్తూ దానం నాగేందర్ దాఖలు చేసిన పిటిషన్‌ను గురువారం కొట్టివేసింది. హైకోర్టు చట్టాన్ని సరిగ్గానే అర్థం చేసుకుని తీర్పు ఇచ్చిందని సుప్రీంకోర్టు ధర్మాసనం స్పష్టం చేసింది. భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జాయ్‌మాల్య బాగ్చీ, జస్టిస్ వి. మోహనలతో కూడిన ధర్మాసనం దానం పిటిషన్‌ను విచారించింది. పార్టీ ఫిరాయింపుల నిరోధక చట్టంలోని నిబంధనల ప్రకారం అనర్హత వేటు విషయంలో హైకోర్టు ఇచ్చిన నిర్ణయంలో జోక్యం చేసుకోవాల్సిన అవసరం లేదని పేర్కొంది. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ తరఫున ఖైరతాబాద్ నుంచి దానం నాగేందర్ ఎమ్మెల్యేగా గెలిచారు. అనంతరం కాంగ్రెస్‌లో చేరి 2024 లోక్‌సభ ఎన్నికల్లో సికింద్రాబాద్ నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేశారు. ఈ నేపథ్యంలో పార్టీ ఫిరాయింపులపై బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి, బీజేపీ శాసనసభాపక్ష నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి చేసిన ఫిర్యాదులపై వివాదం నెలకొంది. స్పీకర్ నిర్ణయాన్ని సవాల్ చేస్తూ వారు హైకోర్టును ఆశ్రయించగా.. దానం నాగేందర్‌ను అనర్హుడిగా ప్రకటిస్తూ హైకోర్టు తీర్పు ఇచ్చింది. హైకోర్టు తీర్పు ప్రకారం 2024 ఏప్రిల్ 23 నుంచే దానం నాగేందర్ అనర్హత అమల్లోకి వచ్చినట్లు పరిగణించారు. దీంతో ఖైరతాబాద్ అసెంబ్లీ స్థానం ఖాళీ అయినట్లుగా మారింది. తాజాగా సుప్రీంకోర్టు కూడా హైకోర్టు తీర్పును సమర్థించడంతో ఖైరతాబాద్ ఉప ఎన్నికకు మార్గం సుగమమైంది. అయితే ఉప ఎన్నిక నిర్వహణకు సంబంధించిన అధికారిక ప్రక్రియను ఎన్నికల సంఘం చేపట్టాల్సి ఉంది. తాజా నివేదికల ప్రకారం రాష్ట్రంలో కొనసాగుతున్న ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియ పూర్తయిన తర్వాతే ఉప ఎన్నిక నిర్వహించే అవకాశం ఉందని ఎన్నికల వర్గాలు చెబుతున్నాయి. ఈ నేపథ్యంలో ఖైరతాబాద్ ఉప ఎన్నిక ఎప్పుడు జరుగుతుందన్నది ఎన్నికల సంఘం తదుపరి నిర్ణయంపై ఆధారపడి ఉంటుంది. ఇప్పటికే ప్రధాన రాజకీయ పార్టీలు ఖైరతాబాద్ ఉప ఎన్నికపై దృష్టి సారించాయి. అభ్యర్థుల ఎంపిక, నియోజకవర్గంలో పార్టీ బలాబలాలు, క్షేత్రస్థాయి కార్యాచరణపై రాజకీయ వర్గాల్లో చర్చ మొదలైంది. బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీలు ఈ ఉప ఎన్నికను ప్రతిష్ఠాత్మకంగా తీసుకునే అవకాశం ఉన్నట్లు తాజా రాజకీయ నివేదికలు పేర్కొంటున్నాయి. దానం నాగేందర్ భవిష్యత్ రాజకీయ అడుగులపైనా ఆసక్తి నెలకొంది. సుప్రీంకోర్టు తీర్పు అనంతరం ఆయన మరోసారి ఎన్నికల బరిలోకి దిగుతానని సంకేతాలు ఇచ్చినట్లు తాజా నివేదికలు పేర్కొంటున్నాయి. అయితే ఆయన ఏ పార్టీ తరఫున పోటీ చేస్తారన్నది ఇంకా స్పష్టతకు రావాల్సి ఉంది. సుప్రీంకోర్టు తీర్పుతో ఖైరతాబాద్ అసెంబ్లీ స్థానానికి ఉప ఎన్నిక అనివార్యమైన పరిస్థితి ఏర్పడింది. ఇక ఎన్నికల సంఘం షెడ్యూల్ ప్రకటనతో ఈ నియోజకవర్గంలో రాజకీయ సమీకరణాలు మరింత వేడెక్కే అవకాశం ఉంది.





# సర్కార్ భూమిపై అక్రమ రాజ్యం!

- కబ్జా వెనుక 'బడా' హస్తం ?
- కబ్జా కోరులకు అధికారుల అండా.. ?
- ప్రభుత్వ భూమి రికార్డుల్లో మాయం ?
- అధికారుల మౌనం వెనుక మతలబేంటి ?

అబ్దుల్లాపూర్‌మెట్ – ప్రభాత సూర్యుడు : కోట్ల రూపాయల విలువైన ప్రభుత్వ భూమిపై అక్రమ నిర్మాణాలు యథేచ్ఛగా కొనసాగుతున్నా రెవెన్యూ అధికారులు ఎందుకు స్పందించడం లేదనే ఆరోపణలు కలకలం రేపుతున్నాయి. ఒకసారి అధికారులు అక్రమ నిర్మాణాలను కూల్చివేసి, అదే స్థలంలో మళ్లీ నిర్మాణాలు ఎలా మొదలయ్యాయనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. అబ్దుల్లాపూర్‌మెట్ మండలం పసుమాముల గ్రామ రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్ 451లో ఉన్న 12 గుంటల భూమిలో 6 గుంటలు క్రాంతి యువజన సంఘం పేరిట ఉండగా, మిగిలిన 6 గుంటలు ప్రభుత్వ భూమిగా రికార్డుల్లో ఉన్నట్లు స్థానికులు చెబుతున్నారు. ప్రస్తుత మార్కెట్ విలువ దాదాపు రూ. 3 కోట్ల వరకు ఉంటుందని స్థానికంగా ప్రచారం జరుగుతోంది. ఐతే ఈ భూమిలోకి మళ్ళీ ఇప్పుడు అక్రమార్కులు చొరబడ్డారు.

**మళ్లీ మొదలైన అక్రమ నిర్మాణాలు?**

గతంలో ఈ 6 గుంటల ప్రభుత్వ భూమిలో కొందరు అక్రమ నిర్మాణాలు చేపట్టగా, స్థానికుల ఫిర్యాదుల నేపథ్యంలో రెవెన్యూ అధికారులు స్పందించి నిర్మాణాలను కూల్చివేసారు. అయితే కొద్ది రోజులకే అదే స్థలంలో మళ్లీ నిర్మాణాలు ప్రారంభమయ్యాయి. దీనిపై ఫిర్యాదులు చేసినా, అధికారుల దృష్టికి తీసుకెళ్లినా చర్యలు కనిపించకపోవడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

**కబ్జా వెనుక 'బడా' హస్తం?**

ఈ వ్యవహారం వెనుక స్థానికి ఓ బడా నాయకుడి అండదండలు ఉన్నాయని క్రాంతి యువజన సంఘం సభ్యులు ఆరోపిస్తున్నారు. రెవెన్యూ అధికారులను మేనేజ్ చేస్తూ అక్రమ నిర్మాణాలు కొనసాగిస్తున్నారన్న ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి.

**ప్రభుత్వ భూమి రికార్డుల్లో మాయం?**

గతంలో సర్వే నంబర్ 451లో మొత్తం 12 గుంటల భూమి ఉన్నట్లు పేర్కొనగా, ప్రస్తుతం రికార్డుల్లో ఆ భూమికి సంబంధించిన వివరాలు రికార్డుల్లో కనిపించడంలేదని చెబుతున్నారు. దీని పై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అసలు రికార్డుల్లో ఏముంది ? ప్రభుత్వ భూమి వివరాల్లో ఏమైనా మార్పులు జరిగాయా ? అన్నది అధికారులే స్పష్టం చేయాల్సి ఉంది.

**అధికారుల మౌనం వెనుక మతలబేంటి?**

కోర్టు ఇంజక్షన్ ఆర్డర్ ఉందని చెబుతూ రెవెన్యూ అధికారులు చర్యలను దాటవేస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. అయితే ఆ ఆర్డర్ ఏ భూమికి, ఏ అంశానికి వర్తిస్తుంది ? ప్రస్తుతం జరుగుతున్న నిర్మాణాలపై అది ఎలాంటి ప్రభావం చూపుతుంది ? అన్న విషయాల్లో స్పష్టత రావాల్సి ఉంది. ప్రభుత్వ భూమిని కాపాడాల్సిన బాధ్యత గల అధికారులు గతంలో చర్యలు తీసుకుని, ఇప్పుడు మౌనం వహిస్తున్నారన్న ఆరోపణలపై ఉన్నతాధికారులు దృష్టి సారించాల్సిన అవసరం ఉంది.

**అసలు సర్వే నంబర్ 451లో ఏం జరుగుతోంది? కబ్జా వెనుక ఉన్నది ఎవరు? అధికారుల మౌనం వెనుక కారణమేంటి? ఈ వ్యవహారంపై ప్రభాత సూర్యుడు నిశితంగా పరిశీలిస్తుంది. త్వరాలోనే వాస్తవాలను వెలుగులోకి తీసుకోచ్చే పనిలో పడింది.**

# ముగిసిన గడ్డి అన్నారం మార్కెట్ కమిటీ పాలకవర్గం పదవీకాలం

- సెప్టెంబర్ 19తో రెండేళ్ల పదవీకాలం పూర్తి
- ఆశావాహుల లాబీయింగ్ షురూ !
- చైర్మన్ స్థానంలో ప్రత్యేక అధికారి వస్తారా ?
- అదే పాలకవర్గాన్ని కొనసాగించే యోచనలో సర్కార్ ?




హైదరాబాద్ – ప్రభాత సూర్యుడు : గడ్డి అన్నారం వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలకవర్గం రెండేళ్ల పదవీకాలం సెప్టెంబర్ 19, 2026తో పూర్తైంది. దీంతో తదుపరి చైర్మన్ ఎవరనే అంశంపై ఆశావాహుల్లో అప్పుడే చర్చ మొదలైంది. చైర్మన్ పదవిని ఆశిస్తున్న పలువురు కాంగ్రెస్ నాయకులు పెద్దలను ప్రసన్నం చేసుకునే పనిలో నిమగ్నమైనట్లు తెలుస్తోంది. మరోవైపు ప్రస్తుతం చైర్మన్‌గా కొనసాగుతున్న చిలుక మధుసూదన్ రెడ్డి కూడా తన పదవిని కొనసాగించుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్నట్లు రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది. ఆయనకు ఇంకొన్ని రోజులు అవకాశం ఇవ్వాలనే ప్రతిపాదనపై కూడా పార్టీలో చర్చ జరుగుతున్నట్లు సమాచారం.

**ప్రత్యేక అధికారి వస్తారా?**

పాలకవర్గం పదవీకాలం ముగిసిన నేపథ్యంలో చైర్మన్ స్థానంలో ప్రత్యేక అధికారిని నియమిస్తారా? లేక కొత్త పాలకవర్గాన్ని ఏర్పాటు చేసే వరకు ప్రస్తుత పాలకవర్గాన్నే కొనసాగిస్తారా? అన్నది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది. మార్కెటింగ్ శాఖ అధికారులు ప్రభుత్వానికి కొన్ని ప్రతిపాదనలు చేసినట్లు విశ్వసనీయ సమాచారం. అయితే దీనిపై ఇప్పటివరకు అధికారిక ఉత్తర్వులు వెలువడినట్లు నిర్ధారణ కాలేదు. ఒకవేళ ప్రస్తుత పాలకవర్గాన్ని కొనసాగిస్తే, కొత్తగా చైర్మన్ పదవిని ఆశిస్తున్న పలువురు నేతల ఆశలకు బ్రేక్ పడే అవకాశం ఉంది. మరోవైపు ప్రత్యేక అధికారిని నియమిస్తేడైరెక్టర్ స్థాయి అధికారికి బాధ్యతలు అప్పగించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

**అధికారికంగా సమాచారం అందించాం: ఏఎంసీ కార్యదర్శి**

గడ్డి అన్నారం వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యదర్శి శ్రీనివాస్ మాట్లాడుతూ.. ప్రస్తుత పాలకవర్గం పదవీకాలం సెప్టెంబర్ 19తో ముగిసిందని, ఈ విషయాన్ని మార్కెటింగ్ శాఖ ఉన్నతాధికారులకు తెలియజేశామని తెలిపారు. ఇప్పటివరకు ప్రత్యేక అధికారిగా ఎవరినీ నియమించలేదని ఆయన స్పష్టం చేశారు.

# అక్టోబర్ 2న దేశవ్యాప్తంగా 'నో యూపీఐ డే'




న్యూఢిల్లీ – ప్రభాత సూర్యుడు: యూపీఐ చెల్లింపులపై ఎండీఆర్ (మర్చంట్ డిస్కౌంట్ రేట్) విధించడాన్ని వ్యతిరేకిస్తూ అక్టోబర్ 2న దేశవ్యాప్తంగా 'నో యూపీఐ డే' నిర్వహించాలని ట్రేడర్లు, వ్యాపార సంఘాలు నిర్ణయించినట్లు సమాచారం. ఈ కార్యక్రమంలో భాగంగా డిజిటల్ చెల్లింపులను నిలిపివేసి నిరసన వ్యక్తం చేయనున్నారు. అక్టోబర్ 2న వ్యాపార సంస్థల్లో వినియోగించే యూపీఐ క్యూఆర్ కోడ్‌లు, సౌండ్‌బాక్స్‌లను నల్లటి వస్త్రాలతో కప్పి నిరసన తెలపాలని నిర్ణయించినట్లు తెలుస్తోంది. యూపీఐ ద్వారా జరిగే లావాదేవీలపై ఎండీఆర్ విధిస్తే చిన్న, మధ్యతరహా వ్యాపారులపై అదనపు ఆర్థిక భారం పడుతుందని వ్యాపార వర్గాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. డిజిటల్ చెల్లింపులను ప్రోత్సహిస్తున్న సమయంలో యూపీఐ లావాదేవీలపై అదనపు ఛార్జీలు విధించే ప్రతిపాదనను ఉపసంహరించుకోవాలని ట్రేడర్లు, వ్యాపార సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. తమ అభ్యంతరాలను కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు 'నో యూపీఐ డే' ద్వారా దేశవ్యాప్తంగా నిరసన చేపట్టాలని నిర్ణయించినట్లు సమాచారం.




# ఐబొమ్మ రవికి నాంపల్లి కోర్టులో స్వల్ప ఊరట

**సీజ్ చేసిన బ్యాంకు ఖాతాల నుంచి లావాదేవీలకు అనుమతి**
**రూ. 3 కోట్ల నగదు అన్‌ఫ్రీజ్‌కు నిరాకరణ**




హైదరాబాద్ – ప్రభాత సూర్యుడు: ఐబొమ్మ రవికి నాంపల్లి కోర్టులో స్వల్ప ఊరట లభించింది. పోలీసులు సీజ్ చేసిన ఆయన బ్యాంకు ఖాతాలను లావాదేవీల కోసం వినియోగించుకునేందుకు న్యాయస్థానం అనుమతించింది. అయితే ఆయా బ్యాంకు ఖాతాల్లో ఉన్న సుమారు రూ. 3 కోట్ల నగదును అన్‌ఫ్రీజ్ చేయాలన్న అభ్యర్థనను కోర్టు తిరస్కరించింది. పోలీసులు దర్యాప్తులో భాగంగా ఐబొమ్మ రవికి సంబంధించిన బ్యాంకు ఖాతాలను సీజ్ చేశారు. ఈ ఖాతాలను తిరిగి లావాదేవీలకు వినియోగించుకునేందుకు అనుమతించాలని ఆయన తరఫు న్యాయవాదులు కోర్టును ఆశ్రయించారు. వాదనలు పరిశీలించిన న్యాయస్థానం ఖాతాల వినియోగానికి అనుమతిస్తూ ఆదేశాలు జారీ చేసింది. అయితే ఖాతాల్లో నిల్వ ఉన్న సుమారు రూ. 3 కోట్ల నగదుపై మాత్రం కోర్టు అన్‌ఫ్రీజ్ ఆదేశాలు ఇవ్వలేదు. ఆ మొత్తాన్ని ప్రస్తుతానికి సీజ్ చేసిన స్థితిలోనే కొనసాగించాలని స్పష్టం చేసినట్లు సమాచారం. దీంతో ఖాతాల నిర్వహణకు అనుమతి లభించినప్పటికీ, రూ. 3 కోట్ల నగదుపై ఐబొమ్మ రవికి ఊరట దక్కలేదు.




# మోదీ జన్మదినం సందర్భంగా సేవా కార్యక్రమం

## గర్భిణీలు, రోగులకు పండ్ల పంపిణీ




హయత్‌నగర్ – ప్రభాత సూర్యుడు: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ జన్మదినం సందర్భంగా హయత్‌నగర్ ప్రభుత్వ ఆసుపత్రిలో సేవా కార్యక్రమాన్ని నిర్వహించారు. మాజీ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో గర్భిణీలు, ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నవజీవన్‌రెడ్డి మాట్లాడుతూ ప్రధాని మోదీ జన్మదినాన్ని పురస్కరించుకుని ప్రజలకు ఉపయోగపడే సేవా కార్యక్రమం నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. సమాజంలోని ప్రతి ఒక్కరూ మానవతా దృక్పథంతో ముందుకు వచ్చి ఆపదలో ఉన్నవారికి అండగా నిలవాలని పిలుపునిచ్చారు. పేదలు, అవసరమైన వారికి సహాయం అందించడమే లక్ష్యంగా ప్రజాసేవలో నిరంతరం కొనసాగుతామని తెలిపారు. ఆరోగ్యమే మహాభాగ్యమని, గర్భిణీలు, రోగులు, ప్రతి కుటుంబం ఆరోగ్యంగా ఉండాలని ఆకాంక్షించారు. ప్రధాని నరేంద్ర మోదీకి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తూ ఆయన ఆయురారోగ్యాలతో దేశ ప్రజలకు మరెన్నో సంవత్సరాలు సేవలందించాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి బండారి భాస్కర్, హయత్‌నగర్, హైకోర్టు కాలనీ డివిజన్ అధ్యక్షులు గంగాని శ్రీనివాస్, మధుసూదన్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి సురేష్, జిల్లా కార్యవర్గ సభ్యులు నర్సింహ, ఎస్సీ మోర్చా ప్రధాన కార్యదర్శి పారంద మహేష్, నాయకులు జంగా రెడ్డి, అరుణ్, బీజేవైఎం నాయకులు ఎర్ర ప్రేమ్, అభిలాష్, హ్రీరితిక్ తదితరులు పాల్గొన్నారు.



# బహుజనుల బాణాన్ని.. యువత యుద్ధ నినాదాన్ని

మొదటి పేజీ తరువాయి



అవకాశాలు ఉన్నప్పటికీ ప్రభుత్వం వినియోగించుకోవడం లేదని ఆరోపించారు. తాము అధికారంలోకి వస్తే జూరాల నుంచి నీటిని తీసుకెళ్లి ఇబ్రహీంపట్నం వరకు 10 లక్షల ఎకరాలకు సాగునీరు అందిస్తానని, అది సాధించలేకపోతే తన పేరు మార్చుకుంటానని సవాల్ చేశారు. రైతుల సమస్యలను కూడా కవిత ప్రస్తావించారు. యూరియా, సాగునీరు, విద్యుత్, రైతు భరోసా, మద్దతు ధర, బోనస్ కోసం రైతులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. గతంలో గద్వాల ప్రాంతంలో పంటకు మద్దతు ధర లభించక రైతు ఆత్మహత్యకు పాల్పడ్డ ఘటనను ప్రస్తావిస్తూ, రైతులు మళ్లీ అలాంటి పరిస్థితుల్లోకి వెళ్లకుండా ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని కోరారు. తెలంగాణలో సామాజిక అన్యాయం కొనసాగుతోందని కవిత ఆరోపించారు. ముదిరాజ్, ముస్లిం, నేతన్న, గీతన్న వర్గాలకు జనాభా ప్రాతిపదికన ప్రాతినిధ్యం కల్పించాలని అన్నారు. ఎస్సీ వర్గాల్లోని వివిధ సమూహాలతో పాటు లంబాడీలు, ముస్లింలకు కూడా తగిన రాజకీయ ప్రాతినిధ్యం కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. లగచర్ల ఘటన, మక్తల్‌లో ఇథనాల్ ఫ్యాక్టరీకి వ్యతిరేకంగా జరిగిన ఆందోళనలపై కూడా ఆమె ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. తనపై వస్తున్న రాజకీయ విమర్శలకు కవిత స్పందిస్తూ.. తాను కాంగ్రెస్ వదిలిన బాణం కాదని, బీఆర్ఎస్ వదిలిన బాణం కాదని, బీజేపీ బాణం కూడా కాదని అన్నారు. తాను బహుజనుల బాణాన్ని, యువత యుద్ధ నినాదాన్ని అని పేర్కొన్నారు. సావిత్రిబాయి పూలే ఆశయాలతో ముందుకు సాగుతున్న వీరవనితగా తనను తాను అభివర్ణించుకున్నారు. ప్రజలు ఆశీర్వదిస్తే ప్రధాని మోదీ, కేసీఆర్, రేవంత్‌రెడ్డితో రాజకీయంగా పోరాడతానని కవిత అన్నారు. ఎవరి మద్దతు లేకుండానే ఒక మహిళ రాజకీయంగా ఎదగగలదని నిరూపిస్తానని చెప్పారు. తెలంగాణలో మహిళా నాయకత్వానికి మరిన్ని అవకాశాలు రావాలని, మాతృస్వామ్య భావనతో ప్రజా పాలనలో మహిళల భాగస్వామ్యాన్ని పెంచాలని పిలుపునిచ్చారు. కొడంగల్ పరిధిలోని కొన్ని మండలాల్లో అక్షరాస్యత రేటు తక్కువగా ఉందని పేర్కొంటూ ప్రభుత్వంపై విమర్శలు చేశారు. ముఖ్యమంత్రికి మరో రెండేళ్ల సమయం మాత్రమే ఉందని, ఇప్పటికైనా ప్రాంత అభివృద్ధిపై దృష్టి సారించాలని సూచించారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయడం లేదని ఆరోపించారు. మహబూబ్‌నగర్ జిల్లాలో కాంగ్రెస్‌కు ప్రజలు పెద్ద సంఖ్యలో ఎమ్మెల్యే స్థానాలు ఇచ్చినా ప్రజా సమస్యలు పరిష్కారం కాలేదని కవిత విమర్శించారు. ఇసుక, మట్టి, ఇందిరమ్మ ఇళ్ల విషయంలో అక్రమాలకు పాల్పడుతున్నారంటూ ఆమె ఆరోపణలు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఉద్యమకారులు, ఉద్యోగులు, ప్రజలకు ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవడం లేదని అన్నారు. బహుజన రాజ్యం కోసం ప్రజలు తమ పార్టీకి మద్దతు ఇవ్వాలని, యువతకు రాజకీయాల్లో అవకాశాలు కల్పిస్తామని కవిత పిలుపునిచ్చారు.

# ప్రభాత సూర్యుడు సంపాదకీయం




## ప్రభుత్వ వైద్యం బలోపేతం ఎప్పుడు?

తెలంగాణలో ప్రభుత్వ ఆసుపత్రుల వైద్య మౌలిక వసతులపై తాజాగా వెలుగులోకి వచ్చిన గణాంకాలు ఆందోళన కలిగిస్తున్నాయి. రాష్ట్రంలో సుమారు 3.8 కోట్ల జనాభాకు ప్రభుత్వ ఆసుపత్రుల్లో కేవలం 9 ఎంఆర్ఐ యంత్రాలు మాత్రమే ఉన్నట్లు అసెంబ్లీలో ఆరోగ్య శాఖ వెల్లడించినట్లు తాజా నివేదికలు చెబుతున్నాయి. అంతేకాకుండా 33 జిల్లాల్లో 29 జిల్లాల్లో ప్రభుత్వ ఆధ్వర్యంలో ఎంఆర్ఐ సౌకర్యం లేకపోవడం మరింత ఆలోచించాల్సిన అంశం. ప్రభుత్వ వైద్యం పేద, మధ్యతరగతి ప్రజలకు ప్రధాన ఆధారం. ఖరీదైన ప్రైవేటు వైద్యం భరించలేని కుటుంబాలకు ప్రభుత్వ ఆసుపత్రులే ఆశాకిరణం. అలాంటి ఆసుపత్రుల్లో ఆధునిక నిర్ధారణ పరికరాలు అందుబాటులో లేకపోతే రోగులు తప్పనిసరిగా ప్రైవేటు ఆసుపత్రులను ఆశ్రయించాల్సి వస్తుంది. దీంతో వైద్యం ఖర్చు పెరగడమే కాకుండా, వ్యాధి నిర్ధారణలో జాప్యం జరిగే ప్రమాదం కూడా ఉంటుంది. అభివృద్ధి అంటే కేవలం రహదారులు, వంతెనలు, భవనాలు నిర్మించడం మాత్రమే కాదు. ప్రజలకు అందుబాటులో ఉన్న నాణ్యమైన వైద్యం కూడా అభివృద్ధికి ప్రధాన కొలమానం. ప్రతి జిల్లాలో అవసరానికి తగిన ఆధునిక వైద్య పరికరాలు, నిపుణులైన వైద్యులు, సాంకేతిక సిబ్బంది, నిర్వహణ వ్యవస్థ ఉండేలా ప్రభుత్వం దీర్ఘకాలిక ప్రణాళిక రూపొందించాలి. ప్రభుత్వ ఆసుపత్రుల్లో పరికరాలు ఏర్పాటు చేయడం ఒక భాగం మాత్రమే. అవి నిరంతరం పనిచేసేలా నిర్వహణ, సాంకేతిక నిపుణుల నియామకం, మరమ్మతులకు ప్రత్యేక నిధులు కూడా అవసరం. పరికరాలు ఉన్నా పనిచేయకపోతే ప్రయోజనం ఉండదు. ప్రజారోగ్యంపై పెట్టే ప్రతి రూపాయి భవిష్యత్తుపై పెట్టుబడే. తెలంగాణలో ప్రభుత్వ వైద్య వ్యవస్థను మరింత బలోపేతం చేసి, జిల్లా స్థాయిలోనే అత్యాధునిక వైద్య పరీక్షలు అందుబాటులోకి తీసుకురావాల్సిన అవసరం ఉంది. "ప్రభుత్వ ఆసుపత్రి అంటే పేదల ఆసుపత్రి" అనే భావన మారి, "ప్రభుత్వ ఆసుపత్రి అంటే నాణ్యమైన వైద్యం" అనే నమ్మకం ప్రజల్లో ఏర్పడినప్పుడే ఆరోగ్య రంగంలో నిజమైన మార్పు సాధ్యమవుతుంది.

### ప్రభాత సూర్యుడు సంపాదకీయ వ్యాఖ్య:

ప్రజలకు ఉచితంగా లేదా తక్కువ ఖర్చుతో వైద్యం అందించడం ఎంత ముఖ్యమో, సరైన సమయంలో సరైన పరీక్ష అందించడం కూడా అంతే ముఖ్యం. ప్రతి జిల్లాకు అవసరమైన వైద్య పరికరాలపై ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణ రూపొందించాల్సిన సమయం ఆసన్నమైంది.

## ధ్వజారోహణంతో వైభవంగా శ్రీవారి బ్రహ్మోత్సవాలు ప్రారంభం

### మీన లగ్నంలో గరుడధ్వజ ఆవిష్కరణ
### సకల దేవతలు, అష్టదిక్పాలకులకు ఆహ్వానం



తిరుమల – ప్రభాత సూర్యుడు: తిరుమల శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాలు మంగళవారం సాయంత్రం వైభవంగా ప్రారంభమయ్యాయి. సాయంత్రం 6.21 గంటల నుంచి 6.35 గంటల మధ్య మీన లగ్నంలో నిర్వహించిన ధ్వజారోహణ ఘట్టంతో బ్రహ్మోత్సవాలు అధికారికంగా ప్రారంభమయ్యాయి. శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ మలయప్పస్వామివారి సమక్షంలో వేదగానాలు, మంగళవాయిద్యాల నడుమ అర్చకస్వాములు బంగారు ధ్వజస్తంభంపై గరుడధ్వజాన్ని ఎగురవేశారు. శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో ధ్వజారోహణానికి విశిష్ట ప్రాశస్త్యం ఉంది. సకల దేవతలు, అష్టదిక్పాలకులను బ్రహ్మోత్సవాలకు ఆహ్వానిస్తూ ఈ పవిత్ర ఘట్టాన్ని నిర్వహిస్తారు. ధ్వజారోహణకు ముందు శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ మలయప్పస్వామివారిని బంగారు తిరుచ్చిపై ఆలయ నాలుగు మాడ వీధుల్లో ఊరేగించారు. స్వామివారితో పాటు పరివార దేవతలైన శ్రీ అనంత, గరుడ, చక్రత్తాళ్వార్, సేనాధిపతి వారిని కూడా ఊరేగింపుగా తీసుకువచ్చారు. ఈ సందర్భంగా ధ్వజపటాన్ని కూడా ఊరేగింపులో భాగంగా తీసుకెళ్లారు. మంగళవాయిద్యాల నడుమ సాగిన ఈ ఊరేగింపు, వేద పండితుల మంత్రోచ్చారణలు, భక్తుల గోవింద నామస్మరణతో తిరుమల ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. ధ్వజారోహణ ఘట్టాన్ని తిలకించేందుకు పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. బ్రహ్మోత్సవాల ప్రారంభాన్ని పురస్కరించుకుని తిరుమలలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. స్వామివారి వాహన సేవలు, ఊరేగింపులు వైభవంగా నిర్వహించేందుకు టీటీడీ అధికారులు ఏర్పాట్లు చేపట్టారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా తిరుమలకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన చర్యలు తీసుకుంటున్నారు. ఈ కార్యక్రమంలో శ్రీశ్రీశ్రీ పెద్దజీయర్, శ్రీశ్రీశ్రీ చిన్నజీయర్, టీటీడీ ఈవో ముద్దాడ రవిచంద్ర, కంకణ బట్టర్ వెంకట రాఘవ దీక్షితులు, టీటీడీ బోర్డు సభ్యులు జ్యోతుల నెహ్రూ, భాను ప్రకాష్ రెడ్డి, పనబాక లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

## గణేష్ నిమజ్జనానికి NO


### ట్యాంక్‌బండ్‌పై నిషేధ బోర్డులు
### హైకోర్టు ఆదేశాల నేపథ్యంలో ఏర్పాటు
### నిమజ్జన ఏర్పాట్ల మధ్య బోర్డులపై భక్తుల అసహనం




హైదరాబాద్ – ప్రభాత సూర్యుడు: ట్యాంక్‌బండ్‌పై గణేష్ నిమజ్జనం చేయకూడదని హెచ్చరిస్తూ నిషేధ బోర్డులు ఏర్పాటు చేశారు. హైకోర్టు ఆదేశాల నేపథ్యంలో ఇందిరాగాంధీ విగ్రహం నుంచి ఎన్టీఆర్ మార్గంలోని అమరవీరుల స్తూపం వరకు ఈ బోర్డులను ఏర్పాటు చేసినట్లు తెలుస్తోంది. ఒకవైపు గణేష్ నిమజ్జనానికి ఏర్పాట్లు కొనసాగుతుండగా, మరోవైపు నిమజ్జనం చేయకూడదంటూ బోర్డులు ఏర్పాటు చేయడంపై భక్తులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. గత ఏడాది కూడా ట్యాంక్‌బండ్‌పై ఇదే తరహాలో నిషేధ బోర్డులు ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. ఈ ఏడాది కూడా బోర్డులు వెలియడంతో నిమజ్జనం విషయంలో తదుపరి పరిణామాలపై ఉత్కంఠ నెలకొంది.

## ఏడేళ్లలోపు శిక్ష పడే సెక్షన్లలో ఎలా అరెస్ట్ చేస్తారు ?

### నోటీసులు ఇచ్చి దర్యాప్తు చేయాలని ఆదేశం
### ఎర్రవెల్లి పసుపు నీళ్ల కేసులో అరెస్టులపై హైకోర్టు కీలక ఆదేశాలు



హైదరాబాద్ – ప్రభాత సూర్యుడు: ఎర్రవెల్లి పసుపు నీళ్ల వ్యవహారంలో కాంగ్రెస్ ప్రభుత్వానికి హైకోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. ఈ కేసులో నిందితులను అరెస్ట్ చేయవద్దని హైకోర్టు ఆదేశించింది. నిందితులకు నోటీసులు జారీ చేసి దర్యాప్తు కొనసాగించాలని పోలీసులను ఆదేశించినట్లు సమాచారం. ఏడేళ్లలోపు శిక్ష పడే సెక్షన్ల కింద కేసు నమోదైనప్పుడు నిందితులను ఎలా అరెస్ట్ చేస్తారని హైకోర్టు ప్రశ్నించినట్లు తెలుస్తోంది. అరెస్టులకు సంబంధించి సుప్రీంకోర్టు జారీ చేసిన మార్గదర్శకాలను పాటించాల్సిన అవసరం ఉందని కోర్టు స్పష్టం చేసినట్లు సమాచారం. సుప్రీంకోర్టు మార్గదర్శకాలు అరెస్ట్ చేయొద్దని స్పష్టంగా చెబుతున్నప్పటికీ మళ్లీ నిందితులను ఎలా అరెస్ట్ చేస్తారని హైకోర్టు ఘాటు వ్యాఖ్యలు చేసినట్లు తెలుస్తోంది. నిందితులకు నోటీసులు ఇచ్చి విచారణ చేపట్టాలని ఆదేశిస్తూ కేసు దర్యాప్తు తీరుపై హైకోర్టు ప్రశ్నలు లేవనెత్తింది. హైకోర్టు ఆదేశాలతో ఎర్రవెల్లి పసుపు నీళ్ల వ్యవహారం మరోసారి చర్చనీయాంశంగా మారింది. కేసులో తదుపరి దర్యాప్తు ఏ విధంగా కొనసాగుతుందన్నది ఆసక్తికరంగా మారింది.

## యూపీఐ వినియోగదారులకు బిగ్ అలర్ట్!

### అక్టోబర్ 15 నుంచి చెల్లింపుల్లో మార్పులు
### వ్యక్తి నుంచి వ్యక్తికి చెల్లింపులు ఉచితమే




హైదరాబాద్ – ప్రభాత సూర్యుడు: యూపీఐ వినియోగదారులకు అక్టోబర్ 15 నుంచి కొత్త మార్పులు అమల్లోకి రానున్నాయి. వ్యక్తి నుంచి మరో వ్యక్తికి చేసే చెల్లింపులు ఉచితంగానే కొనసాగనున్నాయి. అయితే వ్యాపారులకు చేసే కొన్ని చెల్లింపులపై ఇకపై రుసుములు విధించే విధానంలో మార్పులు రానున్నాయి. రూ.2,000కు మించిన ఎంపిక చేసిన వ్యాపారి చెల్లింపులపై 0.4 శాతం వ్యాపారి రుసుము వర్తించనుంది. ఈ రుసుము వినియోగదారుల నుంచి నేరుగా వసూలు చేయకుండా వ్యాపారులపై విధించే విధంగా నిబంధనలు ఉండనున్నాయి. అయితే సాధారణంగా వ్యక్తిగతంగా చేసే యూపీఐ చెల్లింపులపై వినియోగదారులు ఎలాంటి రుసుము చెల్లించాల్సిన అవసరం ఉండదు. కొత్త మార్పులు ప్రధానంగా వ్యాపార సంబంధిత లావాదేవీలకు వర్తించనున్నాయి.



## శ్రీవారి పెద్దశేష వాహన సేవ

# మావోయిస్టు డివిజన్ కమిటీ సభ్యురాలు నక్కా సుశీల రాణి లొంగుబాటు

### ఈ ఏడాది ఇప్పటివరకు 266 మంది మావోయిస్టులు లొంగుబాటు
### తెలంగాణ పోలీసుల వ్యూహాత్మక చర్యలకు కీలక ఫలితం









నిజామాబాద్ – ప్రభాత సూర్యుడు: మావోయిస్టు పార్టీ డివిజన్ కమిటీ సభ్యురాలు నక్కా సుశీల రాణి నిజామాబాద్ పోలీస్ కమిషనర్ ఎదుట లొంగిపోయారు. స్పెషల్ ఇంటెలిజెన్స్ బ్రాంచ్ (ఎస్ఐబీ), గ్రేహౌండ్స్, జిల్లా పోలీసుల సమన్వయంతో కొనసాగిన వ్యూహాత్మక చర్యల నేపథ్యంలో ఈ లొంగుబాటు జరిగినట్లు పోలీసులు తెలిపారు. 2026 సంవత్సరంలో ఇప్పటివరకు మొత్తం 266 మంది అజ్ఞాత మావోయిస్టులు హింసామార్గాన్ని వీడి లొంగిపోయినట్లు పోలీసు శాఖ వెల్లడించింది. వీరిలో ముగ్గురు కేంద్ర కమిటీ సభ్యులు, 12 మంది రాష్ట్ర కమిటీ సభ్యులు, ఒక ప్రాంతీయ కమిటీ సభ్యుడు, 25 మంది డివిజనల్ కమిటీ కార్యదర్శులు లేదా సభ్యులు ఉన్నట్లు తెలిపింది. అదేవిధంగా 94 మంది ఏరియా కమిటీ సభ్యులు, 131 మంది సాధారణ మావోయిస్టులు కూడా లొంగిపోయినట్లు పేర్కొంది. నక్కా సుశీల రాణి లొంగుబాటుతో మావోయిస్టు పార్టీ తెలంగాణలో మరింత బలహీనపడినట్లు పోలీసు శాఖ తెలిపింది. పార్టీ అగ్రస్థాయి నుంచి క్షేత్రస్థాయి వరకు నెట్‌వర్క్ దెబ్బతిన్నట్లు వెల్లడించింది. ప్రస్తుతం తెలంగాణకు చెందినవారిలో ముప్పాళ్ల లక్ష్మణ్‌రావు అలియాస్ గణపతి, జడె రత్నబాయి అలియాస్ సుజాత, వార్త శేఖర్ అలియాస్ మంగు అనే ముగ్గురు నేతలు మాత్రమే ఇతర రాష్ట్రాల్లో అజ్ఞాతంలో ఉన్నట్లు పోలీసులు ధ్రువీకరించారు. అజ్ఞాతంలో ఉన్న మిగిలిన మావోయిస్టులు కూడా హింసామార్గాన్ని వీడి తెలంగాణ ప్రభుత్వం అందిస్తున్న లొంగుబాటు, పునరావాస విధానాన్ని వినియోగించుకుని సాధారణ జనజీవన స్రవంతిలో కలవాలని పోలీసు శాఖ విజ్ఞప్తి చేసింది.

## నాలుగు కోట్ల ప్రజల భాగస్వామ్యంతో

మొదటి పేజీ తరువాయి


# ఆధునిక తెలంగాణ నిర్మాణం



ఆధారంగా బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించే బిల్లులను శాసనసభలో ఆమోదించి రాష్ట్రపతి ఆమోదానికి పంపామని రేవంత్‌రెడ్డి తెలిపారు. సుప్రీంకోర్టు తీర్పు మేరకు ఎస్సీ వర్గీకరణ చేపట్టామని పేర్కొన్నారు. విద్య, వైద్య రంగాలకు తమ ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యం ఇస్తోందని సీఎం తెలిపారు. ప్రతి నియోజకవర్గంలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలలను ఏర్పాటు చేస్తున్నామని, ప్రభుత్వ పాఠశాలల్లో ప్రీ-ప్రైమరీ తరగతులు ప్రారంభించామని చెప్పారు. విద్యార్థులకు అల్పాహారం, పాలు అందించేందుకు రూ.927 కోట్లు ఖర్చు చేస్తున్నామని తెలిపారు. రాజీవ్ ఆరోగ్యశ్రీ పరిమితిని రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచామని, గోషామహల్‌లో రూ.2,700 కోట్లతో కొత్త ఉస్మానియా ఆసుపత్రి నిర్మాణం ప్రారంభమైందని వెల్లడించారు. యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించేందుకు 72 వేలకుపైగా ప్రభుత్వ ఉద్యోగ నియామకాలను పూర్తి చేశామని సీఎం తెలిపారు. నైపుణ్యాభివృద్ధి కోసం యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ ఏర్పాటు చేశామని, ఐటీఐలను అధునాతన సాంకేతిక కేంద్రాలుగా అభివృద్ధి చేస్తున్నామని చెప్పారు. రాష్ట్ర మౌలిక వసతుల అభివృద్ధికి కూడా ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని రేవంత్‌రెడ్డి తెలిపారు. మెట్రో రెండో దశ విస్తరణకు రూ.38,595 కోట్లతో ప్రతిపాదనలు పంపామని, మూసీ పునరుజ్జీవన ప్రాజెక్టును 55 కిలోమీటర్ల పరిధిలో చేపడుతున్నామని చెప్పారు. రీజినల్ రింగ్ రోడ్డు, పారిశ్రామిక కారిడార్లు, రహదారులు, విమానాశ్రయాల అభివృద్ధితో రాష్ట్ర ముఖచిత్రాన్ని మార్చే దిశగా అడుగులు వేస్తున్నామని అన్నారు. 2047 నాటికి తెలంగాణను 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దాలన్న లక్ష్యంతో 'తెలంగాణ రైజింగ్ 2047' ప్రణాళికలను రూపొందిస్తున్నామని ముఖ్యమంత్రి తెలిపారు. దాదాపు 30 వేల ఎకరాల్లో భారత్ ఫ్యూచర్ సిటీని నెట్-జీరో స్మార్ట్ సిటీగా అభివృద్ధి చేస్తున్నామని చెప్పారు. కృత్రిమ మేధ, ఆరోగ్యం, విద్య, విద్యుత్ వాహనాలు, జీవశాస్త్ర రంగాలకు ప్రత్యేక కేంద్రాలను ఏర్పాటు చేయనున్నట్లు వివరించారు. రాష్ట్రంలో వర్షాభావ పరిస్థితులు, పెరుగుతున్న విద్యుత్ డిమాండ్ నేపథ్యంలో తాగునీరు, విద్యుత్ సరఫరాలో ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకుంటున్నామని సీఎం తెలిపారు. ప్రజల సహకారంతో తెలంగాణను అన్ని రంగాల్లో ముందుకు తీసుకెళ్లి ఆధునిక, అభివృద్ధి చెందిన రాష్ట్రంగా తీర్చిదిద్దుదామని రేవంత్‌రెడ్డి పిలుపునిచ్చారు.

## శ్రీవారికి 15వ సారి పట్టువస్త్రాలు సమర్పించిన చంద్రబాబు

### వార్షిక బ్రహ్మోత్సవాల సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం తరఫున సమర్పణ
### రాష్ట్ర ప్రజల క్షేమం, సమృద్ధిగా వర్షాల కోసం ప్రార్థన




తిరుమల – ప్రభాత సూర్యుడు: శ్రీ వేంకటేశ్వర స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాల ప్రారంభం సందర్భంగా ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మంగళవారం సాయంత్రం రాష్ట్ర ప్రభుత్వం తరఫున శ్రీవారికి పట్టువస్త్రాలు సమర్పించారు. ముఖ్యమంత్రిగా శ్రీవారికి 15వ సారి పట్టువస్త్రాలు సమర్పించడం ద్వారా చంద్రబాబు నాయుడు అరుదైన రికార్డు నమోదు చేశారు. తిరుమలలోని శ్రీ బేడి ఆంజనేయస్వామి ఆలయం వద్దకు చేరుకున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఆయన సతీమణికి అర్చకులు సంప్రదాయబద్ధంగా పరివట్టం కట్టారు. అనంతరం ముఖ్యమంత్రి వెండి పళ్లెంలో ఉంచిన పట్టువస్త్రాలను తలపై మోస్తూ మంగళవాయిద్యాల నడుమ ఊరేగింపుగా శ్రీవారి ఆలయానికి చేరుకున్నారు. అక్కడ పట్టువస్త్రాలను గర్భాలయంలో అర్చకులకు సమర్పించారు. శ్రీవారి దర్శనం అనంతరం రంగనాయకుల మండపంలో వేద పండితులు ముఖ్యమంత్రి దంపతులకు వేదాశీర్వచనం అందించారు. టీటీడీ ఛైర్మన్ బి.ఆర్. నాయుడు, ఈవో ఎం. రవిచంద్ర ముఖ్యమంత్రికి తీర్థప్రసాదాలను అందజేశారు. ఈ సందర్భంగా టీటీడీ రూపొందించిన 2027 నూతన సంవత్సర డైరీలు, క్యాలెండర్లను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడిన ఆయన శ్రీవారికి 15వ సారి పట్టువస్త్రాలు సమర్పించే అవకాశం లభించడం తన అదృష్టంగా భావిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్ర ప్రజల క్షేమం, సుఖసంతోషాల కోసం, రాష్ట్రంలో సమృద్ధిగా వర్షాలు కురవాలని స్వామివారిని ప్రార్థించినట్లు చెప్పారు. భారతదేశం ప్రపంచంలోనే అగ్రరాజ్యంగా ఎదగాలని కూడా శ్రీవారిని కోరుకున్నట్లు తెలిపారు. భక్తుల కోసం అనేక సంస్కరణలు చేపడుతూ తిరుమలను ఆలయ సంస్కృతికి ఆదర్శంగా నిలుపుతున్న టీటీడీ పాలకమండలి, అధికారులు, సిబ్బందిని ముఖ్యమంత్రి అభినందించారు. భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు చేపడుతున్న చర్యలను ప్రశంసించారు. రాత్రి జరిగిన శ్రీవారి పెద్దశేష వాహన సేవలోనూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పాల్గొన్నారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా తిరుమలలో భక్తిశ్రద్ధలు వెల్లివిరిశాయి. శ్రీవారి ఆలయ పరిసరాలు మంగళవాయిద్యాలు, వేద మంత్రోచ్చారణలతో ఆధ్యాత్మిక వాతావరణాన్ని సంతరించుకున్నాయి. ఈ కార్యక్రమంలో మంత్రులు ఆనం రామనారాయణ రెడ్డి, నారా లోకేష్, సత్యప్రసాద్‌తో పాటు పలువురు ప్రజాప్రతినిధులు, టీటీడీ అదనపు ఈవో సిహెచ్. వెంకయ్య చౌదరి, సీవీఎస్వో మురళీకృష్ణ, కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్లు, ఎస్పీ సుబ్బరాయుడు తదితరులు పాల్గొన్నారు.



# ది ప్యారడైజ్ ప్రమోషన్స్ షురూ

నాని నటించిన 'ది ప్యారడైజ్' విడుదలకు వారం రోజులే ఉండటంతో చిత్రబృందం ప్రమోషన్స్ ప్రారంభించింది. సెప్టెంబర్ 17న చెన్నైలో, 18న బెంగళూరులో, 19న కొచ్చిలో ప్రచార కార్యక్రమాలు నిర్వహించనున్నారు. సెప్టెంబర్ 21న హైదరాబాద్‌లో భారీ ప్రీ-రిలీజ్ ఈవెంట్ జరగనుంది. శ్రీకాంత్ ఓదెల దర్శకత్వంలో తెరకెక్కిన ఈ చిత్రం సెప్టెంబర్ 24న ప్రేక్షకుల ముందుకు రానుంది.

# సచివాలయంపై చేయి పెట్టి ఆశీర్వదిస్తున్నట్లుగా... అంబేద్కర్ చేయి అందుకున్నట్లుగా...



హైదరాబాద్ ట్యాంక్‌బండ్ వద్ద నిమజ్జనం వేళ గణనాథుడి అద్భుత దృశ్యం కంటపడింది. ఒకవైపు తెలంగాణ సచివాలయాన్ని తాకుతూ ఆశీర్వదిస్తున్నట్లుగా, మరోవైపు అంబేద్కర్ విగ్రహం చేయి అందుకున్నట్లుగా కనిపిస్తున్న వినాయకుడి విగ్రహం చూపరులను విశేషంగా ఆకట్టుకుంది.




# 'ఆకాశంలో ఒక తార' విడుదల తేదీ ఖరారు

దుల్కర్ సల్మాన్ ప్రధాన పాత్రలో నటిస్తున్న తెలుగు చిత్రం 'ఆకాశంలో ఒక తార' విడుదల తేదీ ఖరారైంది. ఈ బహుభాషా చిత్రాన్ని నవంబర్ 20న ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నట్లు మేకర్స్ ప్రకటించారు. కొత్త పోస్టర్‌ను కూడా విడుదల చేశారు.

# 'మిర్జాపూర్: ది మూవీ'పై హైకోర్టు

'మిర్జాపూర్: ది మూవీ'లో హింసాత్మక సన్నివేశానికి 'షూర్‌వీర్' పాటను నేపథ్య సంగీతంగా ఉపయోగించడంపై ఢిల్లీ హైకోర్టు ప్రశ్నలు లేవనెత్తింది. ఈ అంశంపై కేంద్ర సెన్సార్ బోర్డు వారం రోజుల్లో నిర్ణయం తీసుకోవాలని కోర్టు ఆదేశించింది. ఈ చిత్రం సెప్టెంబర్ 4న థియేటర్లలో విడుదలైంది.




Printed by RATNA GRAPHICS, At H.No. 2-3-703/7, Tirumala Nagar Colony, Police Lane, Amberpet, Hyderabad-500 013 Telangana.
Published by CHERUKU UPENDAR on behalf of HAMSA PUBLICATIONS, Printed at HYDERABAD and Pulblished at H.No: 7-83/2, HANUMAN NAGAR, KUNTLOOR, ABDULLAPUR MET MANDAL,Hayath Nagar, Pin: 501505, Rangareddy District/Hyderabad City,Telangana.
Editor : CHERUKU UPENDAR, E-mail: prabhathasuryudueditor@gmail.com PRGI Reg No : TGTEL/25/A0555